

# 18. అపురూపం మా అంతర్వేదిపాలెం

**ఆహ్లాదకరమైన** ప్రకృతి సౌందర్యంతో అలరారే అందాల గ్రామం మా అంతర్వేదిపాలెం. తూర్పుగోదావరి జిల్లాలో వున్న మా ఊరిలో ఎటుచూసినా పచ్చని చేలూ, కొబ్బరితోటలే! అంతర్వేది సముద్రానికి నాలుగైదు మైళ్ళ దూరంలో ఉంది కాబట్టి మా ఊరికి ఆ పేరు వచ్చిందని అంటారు. గోదావరి సముద్రంలో కలిసే చోటే అంతర్వేది. ఏటా వైకుంఠ ఏకాదశినాడు అంతర్వేది తీర్థం జరుగుతుంది. నరసింహస్వామి దర్శనానికి దేశం నలుమూలల నుండి వేలాదిమంది భక్తులు వస్తారు. పక్కరాష్ట్రాల నుంచి వచ్చే బస్సులతో సహా అన్నీ మా ఊరి మధ్యలోంచే వెళతాయి.

'పార్థాయ ప్రతి బోధితాం' అంటూ పద్మశ్రీ ఘంటసాల గారి భగవద్గీత పొద్దున్నే మా ఊరిని లేపేది. మా గుడిలోని మదనగోపాలస్వామితో సహా ఊరంతా ఉలిక్కిపడి లేచేది. పాకల్లో పాలేళ్ళ కేకల్తో, నూతి దగ్గర పెద్దవాళ్ళ స్నానాలతో పల్లె నిద్రమత్తు వదిలించుకునేది. వంటింట్లో కొబ్బరాకుల సన్నని మంటతో కాచే కాఫీల వాసనతో వాకిళ్ళు ఘుమఘుమలాడేవి. పాలేళ్ళతో సహా అంతా పెద్దపెద్ద స్టీల్ గ్లాస్‌లనిండా కాఫీలు పోసుకుని ఒకచోట కూర్చుని ప్రశాంతంగా తాగాక పనులకి లేచేవారు. అమ్మలు కాస్త ఎండెక్కాక ఇంటి ముందుకు అమ్మకానికి వచ్చే గోదావరి జలపుష్పాలతో వంటలకు సమాయత్తమయ్యేవారు.



గోపాలస్వామి గుళ్ళో సాయంత్రం ఐదుకి స్పీకర్ మోగిందంటే మా పిల్లలందరికీ కెవ్వు కేకే. ఎందుకో ఏమిటో పెద్దవాళ్ళేదో చెప్పేవాళ్ళు. అది మాకు అవసరం లేదు. ప్రసాదాలు పెడతారు. అదే సంతోషం. గబగబా అన్నాలు తినేసి గుడికి పరుగే పరుగు. మరుక్షణం అక్కడ రకరకాల ఆటలు మొదలు. ఆవరణలో ఉండే చెట్ల వెనక దాక్కునే ఆటలు. మగపిల్లలు గుడి గోడలు ఎక్కేసేవారు. ప్రసాదం నివేదన చేసి గంట కొట్టగానే నూతి దగ్గర చేతులు కడుక్కుని ప్రసాదాలకై క్యూ కట్టడం, అక్కడికి దేవుడు కనబడితే చూడడం లేకపోతే లేదు అంతే. ప్రసాదం తీసుకుని తింటూ ఇంటికి వెళ్ళిపోవడం. అదో రిలాక్సేషన్ మాకు.

మా ఊరికి మెయిన్‌రోడ్ టేకిశెట్టిపాలెం. అది చిన్న షాపింగ్ సెంటర్. అక్కడే సుబ్రమణ్యషష్ఠికి పూలు, పడగలు ఇచ్చే గుడి ఉండేది. మాకు అయిదుమైళ్ళ దూరంలో సఖినేటిపల్లి రేవు దాటితే పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం. వినాయకచవితికి చెరువులో దూకి మగపిల్లలు తీసిచ్చే తామరపూలను ఆడపిల్లలు ఆనందంగా అందుకునేవారు. అప్పుడప్పుడూ ఆ చెరువులో చేపలు భారీగా పడుతుంటే మేమంతా గుంపుగా నిలబడి చిత్రంగా చూస్తూ ఉండేవాళ్ళం.

ఊరి చివర ఎక్కడో నేరేడుపళ్ళున్నాయని, గోరింటాకు దొరుకుతుందని ఎవరో చెబితే వెళ్ళిపోయి సాయంత్రం చీకటిపడేదాకా తిరిగి తిరిగి వచ్చినందుకు ఇంటికిరాగానే మొట్టికాయలు పడేవి.

అప్పుడప్పుడూ పిట్టలదొర "అమ్మగారూ! మీకు లాటరీ లక్ష తగిలింది రండి.. రండి..." అంటూ హడావిడిగా వాకిట్లోకొచ్చి ఆశువుగా ఏదో చెబుతూ ఉండేవాడు. మాతో "నాకు గుమ్మడికాయంత బంగారం ఉండేది. కుక్క ముట్టుకుందని పడేశాను" అనేవాడు. అతను చెప్పే అబద్ధాలకు మేం పగలబడి నవ్వేవాళ్ళం. అతనితోపాటు మేం కూడా ఊరంతా తిరుగుతూ ఎక్కే గుమ్మం, దిగే గుమ్మంగా ఉండేవాళ్ళం ఎవరో ఒకరు మా మీద అరిచి ఇంటికి పొమ్మనేదాకా.

సంక్రాంతి పండగ అంటే మూడురకాల కొత్త గౌన్లు, రిబ్బన్లూ, గాజులూ, వాకిట్లో పెద్దపెద్ద నెలముగ్గులు, గొబ్బిళ్ళు, గంగిరెద్దుల సరదాలు, అరిసెలు, పాకుండలు, గారెలు, జంతికలు ఇంకా ఎన్నో. ఆవులున్నవాళ్ళింటికి వెళ్ళి పేడ అడిగి రకరకాల భోగిపిడకలు చేసి వాటితో దండలు గుచ్చి రెడీగా పెట్టుకునే కార్యక్రమం నెలముందునుంచీ మొదలయ్యేది. భోగిరోజు తెల్లవారుజామునే తలస్నానం చేసి కొత్త గౌన్ వేసుకుని ఆ దండలు భోగి మంటలో వెయ్యడం ఒక ప్రాజెక్ట్ మాకు.

మా ఇంటి వెనకే కాలవ ఉండేది. అది అప్పట్లో మొబైల్ స్విమ్మింగ్ ఫూల్. పనిచేసేవాళ్ళకు గిన్నెలకూ, బట్టలకూ శ్రమ లేకుండా చేసే బంగారు తల్లి. ఊరి పొడుగునా ఉండే ఈ పంటకాలువ సరదా ఈతలకు, స్నానాలకు నెలవు. ఆడపిల్లలు మగపిల్లలు అందరం ఈతలు కొట్టేవాళ్ళం. పర్వదినాలకు మాత్రం అప్పన్న రాముని లంకలో ఉండే గోదావరిపాయకి వెళ్ళేవాళ్ళం.






కొత్తగా స్కూల్‌లో చేరిన పిల్లలు బడికి పోనని ఏడుస్తుంటే బరబరా లాక్కుపోయే ఆయా పేరు రామి. అందంగా పిడకలు చేసే ఆవిడ పేరు నాగి. తెల్లవారుజామున లేచి దగ్గుతూ వచ్చే పాలేరు పేరు దానియేలు. అతని దగ్గు వినబడితే మూడయినట్టు. మా చిన్న పాలేరు సంపదు నన్నెంతో ముద్దుచేసి ఎత్తుకోవాలని చూస్తుంటే నేను దొరక్కుండా పారిపోతుండేదాన్ని. వాళ్ళంతా ఇంట్లో సభ్యుల్లా మాతో ఎంతో ప్రేమగా ఉండేవారు. ఆ కాలవ పక్కనే మా ఎలిమెంటరీ స్కూలు ఉండేది. ఐదు క్లాసులకీ కలిపి ఇద్దరే మాస్టార్లు. మా మాస్టారిల్లు మా ఇంటి పక్కనే ఉండేది. మా పురోహితులు సూరన్నగారు, మధురగాన గంధర్వుడు స్వర్గీయ శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు అన్నదమ్ముల పిల్లలు. సూరన్నగారి అబ్బాయే మాకు ఎలిమెంటరీ స్కూల్ మాస్టారు. చిన్న మాస్టారు అనేవాళ్ళం.



నాకు అక్షరాభ్యాసం చేసి, రోజూ ఉదయమే వచ్చి ట్యూషన్ చెప్పిన మాస్టారు కూర్మారావుగారు. నాలుగో తరగతి వరకూ మేం స్కూల్‌కి వెళ్ళలేదు. ఇంట్లోనే చదువు. మలికిపురంలో మా స్కూలు పేరు (AFDT) అంతర్వేదిపాలెం ఫిర్కాడెవలప్మెంట్ ట్రస్ట్ హైస్కూల్. మా ఊరందరికీ ఒకే ఇంటి పేరుండేది. అల్లూరి సీతారామరాజు ఫ్యామిలీ. అంతా తాతల తండ్రుల బంధువులే. హైస్కూల్ టీచర్లు ఇంటిపేరుతోనే "ఒసే అల్లూరీ! ఇలా రావే" అంటూ ప్రేమగా పిలిచేవారు.



మలికిపురంలో మా డిగ్రీ కాలేజ్ కూడా అదే క్యాంపస్‌లో ఉండేది. నేను అట్లాస్ సైకిల్ మీద కాలేజీకి వెళ్ళేదాన్ని. అక్కడ మంగతాయారు, శ్యామలా, రాణీ నా నేస్తాలు. ఆత్మీయ లెక్చరర్లు శ్రీ భాస్కరరావు, శ్రీ శ్రీరామారావు, శ్రీ వెంకటపతి రాజుగార్లు. కాలేజీ పేరు మంగెన వెంకటనరసింహం, జాన శంకరయ్య, రుద్రరాజు వెంకట రామరాజు (MVNJS & RVR) కాలేజ్. ఆ కాలేజీయే నన్ను ఈనాడు ఒక ప్రముఖ ప్రభుత్వరంగ సంస్థలో జనరల్ మేనేజర్‌ని చేసింది. ఈనాటి నా జీవనసౌధానికి పునాదివేసిన సరస్వతీ పీఠం ఆ కళాశాలే. మా కాలేజీకి లక్కవరం, విశ్వేశ్వరాయపురం, గుడిమెల్లంక, మోరి, సఖినేటిపల్లి గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చేవారు.

ఊరంతా ఆత్మీయత పంచే అక్కాచెల్లెళ్ళే, అన్నదమ్ములే. పిన్నమ్మలూ, పెద్దమ్మలే. పెద్దనాన్న, చిన్నాన్నలే! అంతా ఒక కుటుంబం. మా ఊరు లాంటి మంచి ఊరు ప్రపంచంలో ఎక్కడా ఉండదు. ఇందిరా, వాణి, దుర్గా, పద్మా, రేణుకా, నిర్మలా, సుజాతా, లక్ష్మీ, బుజ్జీ, రమా, చంటీ కజిన్ సిస్టర్స్. విశ్వనాథం, బాబు, బాబ్జీ, ఏడుకొండలు, కోటి కజిన్ బ్రదర్స్.

మా ఊరికి సీతారామరాజుగారు అనే డాక్టర్ అందరి ఆరోగ్యాలకి భరోసాగా ఉండేవారు. ఆయన ఉదయమే ఊరిలో ఉన్న పేషంట్స్ అందరినీ ఆప్యాయంగా చూసిన తర్వాతే హాస్పిటల్‌కి వెళ్ళేవారు.

ఊర్లో మూడు గుళ్ళుండేవి. మదనగోపాలస్వామి గుడి, శివాలయం, రామాలయం. శ్రీరామనవమికి గుళ్ళో పందిళ్ళు, సీతారామ కళ్యాణం హడావిడి ఉండేది. ఊరిలోని ప్రతి ఇంట్లోంచి బియ్యం గుడికి పంపేవారు. ఆ బియ్యాన్ని ప్రతి

గింజా శ్రీరామ శ్రీరామ అంటూ మధ్యవేలితో ముక్కల్లేకుండా ఎంచి పక్కకి పెట్టి గుడికి పంపాలి. ఆ రోజు పులిహోరా, పరమాన్నం వాటితోనే. చిరచిరలాడే ఎండలో కల్యాణం చూస్తూ వడపప్పు తిని, మిరియాల పానకం తాగి అక్కడ అందరికీ ఇచ్చే తాటాకు విసనకర్రలను ఆనందంగా తీసుకునేవాళ్ళం. గుడి పక్కనే గ్రంథాలయం. సరస్వతీదేవి వెలిసినట్టుండేది. ఆ లైబ్రరీలో ఉన్న పుస్తకాలన్నీ చదివినందుకు ఆమె నన్ను దీవించి రచయిత్రిని చేసింది. 3 నవలలూ, 4 కథల సంపుటాలూ, 3 కవితల సంకలనాలూ ప్రచురించే స్థాయికి నన్ను ఎదిగించింది ఆ లైబ్రరీయే.

సెకండ్‌షోలకి కజిన్ బ్రదర్స్ ఎస్కార్ట్‌తో నడుచుకుంటూ జోకులేసుకుంటూ సినిమాలకి వెళ్తూంటే ఎంత ఆనందమో చెప్పనలవి కాదు. మలికిపురం, లక్కవరం థియేటర్లలో వారానికి రెండు సినిమాలు చూడాల్సిందే. చూడని సినిమా ఉండకూడదన్నట్టు చూసేవాళ్ళం. ఇంటికొచ్చి సినిమాలపై చర్చోపచర్చలు చేసేవాళ్లం.

మా ఇళ్ళన్నీ కొబ్బరితోటల మధ్య ఉండేవి. వర్షాకాలంలో మట్టి మిలటరీ బూట్లలా అంటుకునేది. అది చూసి మురిసిపోయేవాళ్ళం. పక్కనే ఉన్న సోమన్న నాన్నగారి కొబ్బరితోటలో నీళ్ళు నిలిచిపోయి ఉండేవి. అందులో చేరిన కప్పలు రాత్రంతా చేసే సంగీత కచేరి మాకు జోలపాటగా ఉండేది.

ఊరికి ఒక కోతి ఎక్కడినుంచో వచ్చి ఓ రెండు రోజులుండేది. మా అందరికీ అదో అద్భుతం. పిల్లలంతా ఇంటికి ఓ గెస్ట్ వచ్చినట్టుగా దాని గురించే చెప్పుకునే వాళ్ళం. సెలవురోజంతా దానితోనే గడిపి అది రాత్రి ఏ చెట్టుమీద పడుకుందో చూసి తెల్లారి లేచి అక్కడ చేరిపోయేవాళ్ళం. అది మా గోలకి విసుగెత్తి కాస్త పళ్ళికిలించి, బెదిరించి మీదకి రాబోయేది. ఇంక మేమంతా ఆనందంతో ఉక్కిరిబిక్కిరై గోలగోల చేసేవాళ్ళం. అది చుట్టంలా ఇంకోరోజు ఉండి పక్క ఊరికి వెళ్ళిపోయేది.



అట్లతద్దికి ఊరంతా పాటలు పాడుతూ తిరిగి, తర్వాత ఉయ్యాల లూగడం, సంక్రాంతి గొబ్బిళ్ళ పాటలూ, అప్పుడప్పుడూ తోలుబొమ్మలాటలూ మర్చిపోలేం. గణపతి నవరాత్రులకి, దేవీ నవరాత్రులకి కొన్ని పౌరాణిక, కొన్ని సాంఘిక నాటకాలూ, ఒక రికార్డింగ్ డాన్సు ఉండేవి. అలా పదేసి రోజులు సందడే సందడి.



దసరాకి ఇంటింటికీ స్కూల్ మాస్టారితో కలిసి ఊరేగింపులా వెళ్ళి "అయ్యవారికి చాలు ఐదువరహాలు, పిల్లవాళ్ళకి చాలు పప్పు బెల్లాలు" అంటూ పాటలు పాడితే మాకందరికీ మరమరాలూ, వేపుడు శనగపప్పు పెట్టి మాస్టారికి ఓ రెండు రూపాయలిచ్చే వారు. అప్పుడు వచ్చే దసరా వేషగాళ్ళని చూడడం మాకొక గొప్ప ముచ్చట. ఊరి చెరువు పక్కనున్న రావిచెట్టు చుట్టూ రచ్చబండ ఉండేది. సాయంత్రం ఆరు తర్వాత ఊరి పెద్దలంతా అక్కడ చేరి ఊరి సమస్యలూ, రాజకీయాలూ చర్చించేవారు.

ఏ పర్వదినాలు వచ్చినా గుళ్ళో సరదా సందడి. ఊరంతా అక్కడ హాజరు. అప్పట్లో అవే గెట్ టు గెదర్‌లు మరి. మా ఊరంటే మా గుండెల్లో ఎప్పటికీ చిరంజీవిగా నిలిచే పవిత్రమైన గది. మా ఊరంటే నెయ్యపు నేస్తాలు కొబ్బరిచెట్లూ, కొబ్బరాకుల బూరాలూ, కాడమల్లిపూలూ, దాలిపెరుగూ ఇంకా ఎన్నో మధురజ్ఞాపకాలు. మా నాన్న లక్ష్మీపతిరాజుగారు అందరూ శ్రీరామచంద్రుడి వంశమనీ, రాముడే దేవుడని చెబుతూ, భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు ఏమన్నాడంటే అంటూ నలుగురు కలిస్తే వేదాంతం చెప్పేవారు.

మా నానమ్మ సుబ్బమ్మగారు నిరంతర రామనామస్మరణ చేస్తుండేవారు. ఆవిడ లక్కవరం రుద్రరాజు కుటుంబం వారి ఆడపడుచు నూరేళ్ళు దాటిన సమయంలో ఆమె స్నానం చేసి నూతి దగ్గరికి నడిచివెళ్ళి బకెట్‌తో నీళ్ళు తెచ్చుకుని సూర్యనమస్కారం చేసి అర్ఘ్యమిచ్చేవారు. ఆ తర్వాతే కాఫీ తాగేవారు. ఆమె స్వయంగా వండుకుని తినేవారు. ఆమెతో పాటే తిరుగుతూ ఓ పిల్లి కూడా ఉండేది. ఇద్దరూ కలిసి భోంచేసేవారు. ఆ పిల్లికి కూడా నెయ్యితో సహా అన్నీ వడ్డిస్తూ "ఇది కారణజన్మురాలు నాకోసమే పుట్టింది" అని మాకు చెబుతుండేవారు. మేం కిలకిలా నవ్వుతుంటే ఆమెకి



వినపడేది కాదు. ఆవిడ మేం వెళ్ళగానే పటికబెల్లం ముక్కలు కొట్టిపెట్టేవారు. ప్రతి పండగనీ ఆవిడ కొత్త పంచెకట్టుకుని ఆహ్వానించేవారు.


మధ్యాహ్నాలు పెద్దవాళ్ళు నిద్రపోతుంటే పిల్లలమంతా తోటల్లో చేరి అల్లరి చేసేవాళ్ళం. అక్కడ జామ, పనస, సపోటా, మామిడి చెట్లుండేవి. ఖాళీ ఎడ్లబండిని పిల్లలతో నింపి దాన్ని ఎత్తడం ఒక అడ్వెంచర్. కిందకు కాసే మామిడి కాయలు చెట్లమీద ఉండగానే కొరికి తిని టెంక ఉంచేవాళ్ళం. తెంపిన కాయలు తినడానికి పశువుల పాక చూరులో పాలేళ్ళు కత్తీ, కొడవలితో పాటు ఉప్పు, కారం పొట్లాలు ఉంచేవాళ్ళు. అక్కడే పాకలో పశువులకి ఉలవలు ఉడకబెడుతుంటే వాటిని గుప్పెళ్ళతో తీసుకుని తినేవాళ్ళం.

శ్రీరామనవమికి కూడా తొమ్మిది రోజుల వేడుక జరిగేది. గుడిచుట్టూ వేసే పందిళ్ళల్లోకి మేజువాణి బృందం వచ్చేది. ఆ బృందం సొంత ఆర్కెస్ట్రాతో సినిమా పాటలు పాడుతుంటే అందమైన అమ్మాయిలు డాన్స్ చేసేవారు. వాళ్ళని మేం సినిమా హీరోయిన్లలా భావించి ఉబ్బితబ్బిబ్బవుతూ చూసేవాళ్ళం. వాళ్ళు రోజంతా డాన్స్ చేస్తూ ఉంటే, ఇంట్లో తిట్టినా వినిపించుకోకుండా అక్కడే ఉండేవాళ్ళం.

ఊరి వెచ్చని ఒడి, ఆ మనుషుల ఆప్యాయత, ప్రేమను పంచే పచ్చని పరిసరాలూ ఇప్పటికీ చెక్కుచెదరకుండా అలాగే ఉన్నాయి. ఆకుపచ్చని పరిసరాలూ, దీవించే చల్లని గాలులూ కలిసిన మా ఊరు ప్రకృతి అందాలకు పట్టుగొమ్మైన కోనసీమలోని ప్రధానభాగం. ప్రపంచంలో ఎన్నో గొప్ప ప్రదేశాలుండొచ్చు. కానీ మా ఊరివాళ్ళందరం మాత్రం "సారే జహాసే అచ్చా! అంతర్వేదిపాలెం హమారా!" అని పాడుకుంటాం. మీ కనుమానం ఉంటే మా ఊరొకసారి వచ్చి చూసి వెళ్ళచ్చు.


**– ఆంధ్రప్రభ ఆదివారం మ్యాగజైన్,** *24-02-2019*



భావవల్లరి
కాలమ్స్
అల్లూరి (పెన్మెత్స) గౌరీలక్ష్మి



వసంత కోకిల
అల్లూరి (పెన్మెత్స) గౌరీలక్ష్మి


కొత్తచూపు
అల్లూరి (పెన్మెత్స) గౌరీలక్ష్మి


అల్లూరి (పెన్మెత్స) గౌరీలక్ష్మి
ఎదలోపలి ఎద
నవల


అల్లూరి (పెన్మెత్స) గౌరీలక్ష్మి
నీరెండ దీపాలు
కవితలు


అల్లూరి (పెన్మెత్స) గౌరీలక్ష్మి
అనుకోని అతిథి
నవల


నిలువుటద్దం
వచన కవిత
అల్లూరి (పెన్మెత్స) గౌరీలక్ష్మి


మనోచిత్రం
అల్లూరి (పెన్మెత్స) గౌరీలక్ష్మి


అంతర్గానం
నవల
అల్లూరి (పెన్మెత్స) గౌరీలక్ష్మి